# ఏ 'క్లాస్' ఖైదీ

## పులికంటి కృష్ణారెడ్డి

ఆ ఇంట్లో నుంచి బయటపడి నడి రోడ్డులో నిలబడి తలను మాత్రం తిప్పగలిగినంత వరకు వెనక్కు తిప్పి ఒక్కసారి ఆ ఇంటివైపు ఎగాదిగా చూసి, తక్షణమే తల వంచి, వంచిన తలెత్తకుండా అడుగు మీద అడుగ్గా నడుస్తున్నాడు వెంకటరెడ్డి. నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

"తిరవతికి ఏందో పని మీద వచ్చినానే అనుకో, వచ్చిన పని సూసుకోని తిరుగు దోవ పట్టుకోవాల్నా ప న్లేదా? పని అయిందో కాలేదో వా. డెవుడో పిల్చినాడే అనుకో. ఇం కేం ప న్లేనోడి మాదిర్తో ఆ కొంపకాడికి పోవాలన్న కోరి కెందుకు కలగాల? కలిగింది బో ఆ కొంపకాడి కెందుకు పోవాల? పొయ్‌నాఁవే అనుకో. సుట్టపు సూపుగా సూసేసి వచ్చిన దోవ పట్టుకో నుండచ్చు గదా? పట్టుకోకుండా తీ గ్గదిలిస్తే డొం కంతా కదిలె! దీనికంత కారణం కోరిక. కోరిక కలిగిందే అనుకో, ఆ కోరికను అణుచుకో నుండచ్చు గదా?

ఆ మాట కొస్తే ఆ ముందు ట్నాడు గాందీ రోడ్లో నడస్తా ఉంటే ఎన్ని కోరికలు కలగలా? నాలుగు సెక్రాల బండ్ల మీద ద్రాచ్చి పొండ్లు గుత్తులు గుత్తులుగా అవుపిస్తా ఉంటే వండ్లు పుల్సిపోలేదా? కొందాఁ వనుకోని బోతే కొరివి గాలేదా? పోనీ - వాటి పక్కన్నే దోరగా మాగిన ఆపిలు పొండ్లు రాసులు రాసులుగా పేర్చి పెట్టుంటే నోట్లో నీ ళ్ళూర్లేదా? కోడి గుడ్డంత కాయిని వాడు మూడు రూపాయి లని దర పలికే కుందికి కొందాఁ వన్న కోరిక కొం డెక్కి పోలేదా? ఎండలో తా ర్రోడ్డు మింద అరికాళ్ళు అబ్బా అమ్మను తల్సుకో మంటా ఉంటే, కాళ్ళకు సెప్పులన్నా కొనుక్కుం దాఁవని అంగిట్లోకి దూర్తే వాడు జత సెప్పులు యాభై తొమ్మిది రూపాయలా తొంబై అయిదు పైస లంటే అరవై అనుంటే పోలేదా? అని వాణ్ణి గిచ్చి జగడాని కీడ్సి రొం డని, నాలుగనిపించుకోని 'ఆ సెప్పులూ సరే! నా ఎంటికా సరే!' అనుకుంటా ముక్కులో ఎంటిక పెరికి పారేసినట్టు ఆ కోరికను గూడా యిసి రట్టా అవతల పారేయ్‌లేదా? ఇన్ని కోరికల్ని సంపుకుణ్ణె యదవ జల్మ ఈ కోరికను గూడా సంపుకో నుంటే యిప్పు డిట్లా మల్ల గుల్లాలు పడాల్సిన పనే ఉండేది కాదు గదా?"

ఈ విధంగా ఆలోచిస్తూ నడుస్తున్న వెంకటరెడ్డికి తన ఆలోచనా విధానానికీ, అలనాడు దుర్యోధనుని ఆలోచనా విధానానికీ ఎక్కడో పొంతన లున్నట్టు తోచింది. దుర్యోధనుడు కూడా మయసభలో పరాభ వానంతరం -

"... ఆ రాజసూయాధ్వరంబునకు నే నేల అరుగవలె? పోయితిని బో నా కేల ఆ పాడు మయసభా సందర్శ నేచ్ఛ అంకురించవలె. అంకురించెను బో నే నేల అందందు తిరుగాడి అవాచ్యంబు లగు అవమానంబులకు లోనుగావలె? లో నయితిని బో ఆ సమయమున ఆ బంధకి పాంచాలి న న్నేల పరిహసించ వలె?" అని తన అభ్యంతర మందిరంలో గొంతు కోసిన మేక మల్లే తల్లడిల్లి నాడట!

ఆలోచనా విధానంలో దుర్యోధనుడికీ, తనకూ ఒక్కటే తేడా! దుర్యోధనుడు సగం సంస్కృతం, సగం తెలుగు కలగలిసిన సంకర భాషలో ఆవేదన పడ్తే, తాను మాత్రం అసలు సిస లైన మాండలికంలో మధన పడ్తున్నాడు.

దుర్యోధనుడు రారాజు! తన ఆవేదన వెళ్ళబోసుకోవడానికి రాజ భాషే అవసరమయింది. తా నా? ఒక సామాన్యుడు. సామాన్యుడి భాషలోనే ఆలోచిస్తున్నాడు.

అంటే - రాజ భాష సామాన్యుడి భాష కావడానికి వందల సంవత్సరాలు పట్టిం దన్న మాట!


వెంకటరెడ్డికి నవ్వు వచ్చింది.

ఆ పరిస్థితిలో నవ్వు రాకూడదు. అయినా వచ్చింది. అదే నవ్వు కున్న ప్రత్యేకత. ఒక్కొక్కప్పుడు ఎంత ప్రయత్నించినా రాని నవ్వు, మరొకప్పుడు నే నున్నా నంటూ ముందుకు వస్తుంది. ఆ నవ్వులో వెంకటరెడ్డి మనస్సు క్షణికంగా తేలికపడినా యథాస్థితి చేరుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

మనస్సును ఆలోచనలు ఆక్రమించుకొనేసరికి వెంకటరెడ్డి మొగం పొగ చూరిన కుండలా తయారైంది. ఆ బాట మీద జన ప్రవాహం. ఆ ప్రవాహ వేగంలో ఎవడి తిప్పలు వాడివి, ఎవడి సుఖం వాడిది, ఎవడి ఏడుపు వాడిది, ఎవడి తాపత్రయం వాడిది. అందువల్ల పొగ చూరిన కుండలా తయారైన వెంకటరెడ్డి మొగం ఎవరికంటా పడకుండా బ్రతికిపోయింది.

వెంకటరెడ్డి నడుస్తున్నాడు - అడుగు మీద అడుగ్గా ... ఆలోచనలు పేక పడుగ్గా!

ఆ ముందటి రోజు ఊళ్ళో నుండి తిరుపతికి బయల్దేరుతూంటే వెంకటరెడ్డి భార్య ఎదురుగా నిబడింది. 'ఎక్కడి కీ ప్రయాణం?' అన్నట్టుగా ఒక చూపు విసిరింది. ఆ మీదట -"దు డ్లిచ్చి తద్దినం కొనుక్కుండే. దంటే యిట్టా మాదిర్తోనే గదా? వాడెవుడో బతక నేర్చిన యదవ. గొంతు మిందికొచ్చిం దని కొంపలో కొచ్చి గుంత కూసుండె. కష్టిం ఎవుడి కైనా వొస్తింది. కా దన్లేదే? అయినా మన సేతిలో ఉంటే యియ్యాల. లేకుండాబోతే లేదన్నెప్పాల. ఈ కొంపలో కత అట్టా మాదిరి కాకుండా పాయ్‌నే? వాడికి ముందు నువ్వే 'ఊడిపాయ. జారిపాయ. కొంపలు నిలవనా కూలిపాయ!' అంటా నం గేడుపులు ఏడిస్తివి. ఒగిటా? రొండా? అయిదు వేలే? తెచ్చి వాడి దోసిట్లో పోస్తివి. వాడు గూడా సచ్చి నీ కడపన పుట్టానంటా వొం గొంగి దండాలు పెట్టా ఎలబారిపాయ్‌నె యదవ. ఆర్నెల్లు అవతా ఉండాది. అతీ గెతీ లేకుండా పాయ. ఇపుడు నువ్వు వాణ్ణి ఎతుక్కుంటా ఎలబార్నావు. సచ్చి కడపన పుట్టా నన్నె యదవ. వా డిచ్చినట్టే! నువ్వు తెచ్చుకుణ్ణెట్టే! తెచ్చి నోళ్ళ



కెత్తుకోనిబొయ్ యిచ్చుకుణ్ణేట్టే!"

వెంకట రెడ్డికి అరికాలి మంట ఉచ్చి కెక్కింది. 'ఆడికి నిలపతావా, లేదా నీ దండకం!' అన్నోట్టుగా ఒక్క చూపు చూసినాడు.

"ఈ కాలాన కలిగిన మా టంటే కంట్లో పుల్ల బెట్నొ ట్టంట.. ఆ మా టన్నేల? దానికి రొండు రానేల? కానీ ఎగబెట్టుకోని తిరపతికి పోయేదేఁవో పోత వుండావు. పోతే పోత ఉండావు గానీ నీ వనేందో ను వ్వేందోగా వన్జూసుకోని ఎంబడే తిరుక్కో. అట్ట జూడు ఆ గొడ్డు కల్లా. నువ్వు తిరుక్కో నొచ్చే దాకా అ దట్టా గట్టు గూటన బడి అగోరింఛాల్సిందే కదా? పోనీలే పాపం! కట్టు గూటాన బడి వొగిరిస్తా ఉండాది. కుడితైనా నూవదాఁ వని ఎవుడైనా దగ్గిరికి పోతే సాలు. పొగరుబోతు గుర్రం మాదిర్తో ముందిరి కాళ్ళు రొండూ పై కెత్తి మోర కిస్తింది. అది నరే! నే న్లైస్తా ఉండే దేఁవన్నా సెవల్లో వత్తా ఉండాదా లేదా?"

"ను వ్వాడికి నోరు మూస్తావా లేదా?" గొంతు చించుకొన్నట్లుగా అరిచాడు వెంకటరెడ్డి.

ఆ అరువుతో అదిరిపడిందీ ఆ ఇల్లాలు. అంతలోనే తేరుకుని - "ఈ కొంప రతి కెక్కేటట్టుగా ఉంటే ఆ కతే యిం కొక మాదిర్తో ఉండేది. పోనీలే! నే నొకదాన్నేనా పోత పోత నెత్తిన బెట్టుకోని పోబొయ్యేది. నా దెట్టా రానుంటే అట్నే తెల్లారబోతింది" అని నణుక్కుంటూ ఆ ఇల్లాలు ఇంట్లోకి వెళ్ళింది.

వెంకట రెడ్డి ఊరు ముందర బస్సు ఎక్కాడు.

బస్సు నిండా జనం. కూర్చోవడానికి తావు లేకపోయింది. కనీసం నిలబడడానికి కూడా ఒంటికాలినే ఆశ్రయించవలసి నంత జనం. ఆ జనం మధ్య ఇరుక్కున్నాడు వెంకటరెడ్డి.

'ఇట్లా ప్రయాణం చేయడం మీకు తప్పదు. మిమ్మల్ని మోసేది నాకూ తప్పదు. మీ తిప్పలు మీవి, నా తిప్పలు నావి' అన్నట్లుగా బస్సు మోకాటి లోతు గుంతల్లో పడుతూ, లేస్తూ పోతోంది.

స్వాతంత్ర్యం వచ్చి నలభై ఏం డ్లయింది. ' ఈ నలభై ఏండ్లలో పొడిచేసినాం. గెలిచేసినాం' అంటా అందరూ బల్లలు గుద్ది మాట్లాడేవాళ్ళే. ఈ రోడ్డును చూసి మళ్ళీ మాట్లాడ మనండి చూస్తాం."

"రోడ్లు ఎట్లుంటే ఏఁవి? బస్సు లెట్లుంటే ఏఁవి? గవర్నమెంటోళ్ళకు కావాల్సింది చార్జీలు. మూడు మూన్నాళ్ళకు వాళ్ళు పెంచేస్తానే ఉంటారు. మనం నోరు మూసుకోని అడిగి నంత యిచ్చేస్తా ఉండాం. వా ళ్ళట్నే మన విఁట్నే. మా బ్లెందు గ్గానీ వదండయ్యా సాలు గానీ!"

"మనఁ వంత వొక తా టి మింద నిలబడుకోని ఈ బాట మింద వొచ్చే పొయ్యే బస్సుల్ను అట్టా యిట్టా కదలకుండా నిలేస్తే?"

"మజ్జిక్కి దోవ లే. ఆ డెవుడో పెరుగు కోసరం సీటీ రాసినా డంట. అట్టుండాది మన యవారం. మనఁవా వొక తా టి మింద నిలబడేది? హ్హె హ్హె హ్హె!"

వడుతూ, లేస్తూ ముందుకు పోతున్న బస్సులో ఇరుక్కొన్న ప్రజానీకం వాదోపవాదాల్లో పడుతూ లేస్తున్నారు.

ఒక నవల్లో కథ రచయిత పేరు ప్రచురించకుండా పాఠకులను 'సస్పెన్స్'లో ఉంచే విధానాన్ని మొట్టమొదట అవలంభించింది ఎవరో తెలుసా? ప్రముఖ ఆంగ్ల రచయిత వాల్టర్ స్కాట్. ప్రసిద్ధి చెందిన ఇతని నవలలు ప్రచురించినప్పుడు ఇతని పేరు ఎవరికీ తెలియదు.

ఇతని నవలలను ప్రచురించిన జేమ్స్ బాలంటైన్, స్కాట్‌తో కలిసి ఈ రహస్యాన్ని పది సంవత్సరాలు దాచి ఉంచాడు. ఆ తరువాత పాఠకుల కోరిక ననుసరించి స్కాట్ పేరు బయటపెట్టాడు.

★ 1828లో ప్రారంభించి 22 ఏళ్ళపాటు రోజుకి 15 గంటల చొప్పున బాల్‌జాక్ అనే రచయిత నవలలు రచించాడు. అయిదు వేల కథా పాత్రలను సృష్టించా లనేది అతని ఉద్దేశం. కాని తొంభై నవలలను, మూడు వేల పాత్రలను సృష్టించగలిగాడు.

జాగృతికిరణ్

పివ్వళ్ల బస్తాల్లో కూరి నట్లున్న జనం కానీ, వాళ్ళవివాదోపవాదాలు కానీ వెంకట రెడ్డి చెవిని పడలేదు. అతని కంటి ముందు తన భార్యా ... చెవుల్లో ఆమె మాటలు!.

"సీ సీ! ఈ ఆడో ళ్ళంత యింతే నేఁవే అప్పిటికి ఈళ్ళకే బొరువూ బాద్దెత లుణ్ణెట్టు. తక్కి నోళ్ళ కెవురికీ తేనట్టు. ఎదిటోడు గూడా మణిసే గదా? వాడు తినేది గూడా కూడే గదా! కూడు దినే ఏ యదవకైనా ఆ మాత్రం బుద్ధీ గ్యానం ఉండదా?- అప్పిటికి ఆడదానికి తెల్సినంత మొగోడికి తెల్దని గదా దీని కర్తం!

అయినా అది నిన్న లేక మొ న్నొచ్చిన గొంగిడి. వా డట్టా కాకపాయ్‌నే! ఈది బళ్లో ఓనమాలు రుద్దుకు ణ్ణెప్పు ట్నుంచి అయిదో తరగ ద్దాకా వక్క వక్కన్నే కూసోని గదా నదువుకుణ్ణింది. ఇంక ఆ టిడుపొస్తే ఒక ఆటా? ఒక పాటా? వరవ గుట్టి మింద వరిగి పొండ్లు కోసిందీ మేఁవే! గూటం కొండ కువ్వ మింద కుప్పి గంతు లేసిందీ మేఁవేఁ - ఒక కంచం, ఒక మంచంగా బతికి నోళ్ళం. ఎల్ల కాలం అట్టా మాదిర్నే బతికే దాని కవితిందా? వాడు బోయ్ తిరపతిలో జేరుకుండె. వాడి బతుకు వాడిదిగా ఉంటే కయ్యా గాలవ నూనుకుంటా నా బతుకు నాదిగా ఉండాది. అటు మంటోడు రొండు సేతులూ పట్టుకోని కండ్ల నీళ్ళు బెట్టుకుంటే - అప్పిటికి నేను బతికినట్టా? నచ్చినట్టా? ఈ బాద నా యింట్లోదాని కేం దెల్సు? దానికి తెల్సిం దంతా అయిదు వేలే? అయిదు వేలు ఆ డెవుడో దోవన బొయ్యే యదవ యదా న్నేస్తివే అని! - ఆడ బుద్ధి! అంతకు మించి ఆలోసించ గలిగితిందా?

అక్కర! ఎవుడికైనా వొస్తింది. అక్కర కని దుడ్లు చే బొదులుగా తీసుకున్నోడు యిస్తాడు. ఈకుండా యాడికి బోతాడు? లే దంటే ఈ పొద్దనింది రేవు. రే వనింది ఎల్లుండి. ఈ మాత్రానికే ఓర్సుకోలేకుండా బోతే ఎట్టబ్బా? కష్టాలు మణునలకు రాకుండా మాకులకా వస్తాయి?

అయినా ఈ ఎగవ యింటో ళ్ళుంఢారే? నుద్ద వనికి మాల్నె యదవలు. అటుమంటి యదవలు ఈ బూ ప్రెవంచంలో ఎతికినా దొరకరు. దు డ్లేంది? పాపిష్టి దుడ్లు. ఈ పొద్దు నీ తావన. రేవు యింగొకడి తావన. స్తిరంగా వొక్కడి తావన్నే ఉండిపొయ్యేటట్టుగా ఉంటే? లేకుండా బోతే పోతా పోతా ఎత్తి నెత్తిన బెట్టుకోని పొయ్యేటట్టుగా ఉరతే?

ఆహాహా! యిం కేఁవన్నా ఉండాదా? ఈ యదవలంతా తలకాయి దమ్మిడీ కడగరా?

అ దేవి అరు సోద్దిఁవో? ఈ దుడ్లు కూడా సేరే వాళ్ల తావన్నే సేర్తా ఉంటాయి. ఆ ఎగవింటోళ్ళ యింట్లో యినప్పెట్లో మూలగతా ఉండాయి దుడ్లు. అట్టని ఎవుడికి బత్తే వాడికి జవిరి జవిరి ఎత్తిచ్చెయ్యి మన్లేదే! నూటికి రొండ్రూపాయిల వడ్డీ. వడ్డీ మొదులు అష్టాబావత్తుగా ముక్కు పిండి వసూ ల్జేసుకుంటా ఉండ్లా? నరే! వడ్డికైనా అక్కరకు వొదగల్ల గదా? వొదిగినా రబ్బా! కా దన్లేదే? అట్టని యిస్తావా? నస్తావా? అని గొంతల మింద కూసుంటే -

అయినా ఏం మణుసులో ఈ మణుసులు? అంతా గడ్సి బతకతా ఉండాఁ వనుకుంటారు ఈ లోకంలో ఎవుడికి గడ్సింది? వానువేవు డంతటోడికే గాడ్డి కాళ్ళు వట్టేది తప్పలా! ఈ మాత్రం గ్రెహిస్తే యింకేఁ వుండాది? దర్మం నాలుగు పాదాల మింద నడవదా?"

ధర్మం నాలుగూ పాదాల మీద నడిచేది ఏమో కానీ ఒక్క పాదం నిలబడిన వెంకట రెడ్డి ఆ పాదాన్ని మార్చి మార్చి నిలబడి ఆలోచిస్తున్నాడు.

బస్సు బొట్లవారి వల్లె దాటింది. నల్ల వెంగనవల్లె దాటింది, పాత గుంట దాటింది. పచ్చికపల్లం దగ్గర మలుపు తిరిగి తిరుపతి దారి పట్టింది.

పచ్చికపల్లం దగ్గర బస్సు కాస్తంత వలచబడింది. వెంకటరెడ్డి ఒంటి కాలి తవస్సుకు భంగం కలిగింది. నింపాదిగా కూర్చున్నాడు. నిలబడి నిలబడి కాళ్ళు తీపులు తీస్తున్నాయి. ఆలోచించి ఆలోచించి మనస్సు అలిసిపోయింది. తారు రోడ్డు మీద బస్సు. కష్టాల సుడిగుండాల్లో నుంచి బయటపడిన పూల తెప్పలా తేలిపోతూ ఉంది. వెంకటరెడ్డికి మాగన్ను పడింది.

తిరుపతిలో రాయల్ చెరువు బస్‌స్టాండ్‌లో వెంకటరెడ్డి బస్సు దిగేసరికి పొద్దు నడిమిట్టన ఉంది. నడిమిట్టన మండేవాడు కాల ప్రభావానికి తలవంచక తప్పలేదు. చలి చలిగా వీస్తున్న గాలులకు నులి వెచ్చని కాపడం వేస్తున్నాడు. ఆ హాయిని అనుభవిస్తున్న జనం 'హాయి! హాయి! ఇదేనోయ్!' అని సినిమాల్లో మాదిర పాటలు పాడలేదు కానీ వెన్నెల్లో ఆడుకొంటున్న అనుభూతిని అనుభవిస్తున్నారు.

వాళ్ళల్లో ఒకడు వెంకటరెడ్డి. చిన్ననాటి నేస్తం పాండురంగం ఇంటి దోవపట్టి నడుస్తున్నాడు.

రాయల్ చెరువు బస్ స్టాండ్ దగ్గర రైల్వే గేట్. పాకాల వైపు వెళ్ళే రైలు అప్పుడే ఎగబడిపోయి నట్లుంది. గేట్ తలుపులు తీసినారు. గేట్‌కు ఇరువైపులా కట్టలు గట్టి నిలబడిన జనం ఒక్కసారిగా కదిలినారు. తొందర. ఒకరికి మించి

ఇం కొకరికి. అందరికీ తొందరే. ఆ తొందర్లో సైకిళ్ళు, రిక్షాలు, ఆటోలు, స్కూటర్లు నువ్వు ముందా, నేను ముందా అని పోటీలు పడుతున్నాయి. ఆ పోటీలో ఒకదా న్నొకటి ఢీకొంటున్నాయి. స్వారీ చేస్తున్న వీరులు బూతుల బాణాలు విసురుకొంటున్నారు.

వెంకట రెడ్డి బాట పక్కన నిలబడినాడు. నిలబడి తమాషా చూస్తున్నాడు. చూస్తూ. ఆలోచిస్తున్నాడు.

"ఈళ్ళ కెందు కీ తొందర? యాడ కొంపలు మునిగిపోతా ఉండాయో? ఇట్టా మాదిరి తొందర పడే దెందుకు? తొందర్లో షట్టు దప్పే దెందుకు? డీ కొట్టుకుండే దెందుకు? ఆడికి సొల్లన్నెట్టుగా తిట్టుకుండే దెందుకు?"

నిజంగా వాళ్ళ మీద జాలి కలిగింది వెంకట రెడ్డికి. 'ఏం మణుసులో పాడు మణుసులు!' అనుకుంటూ ముందుకు నడుస్తున్నాడు.

రైల్వే గేట్‌కూ, కర్నాల వీధికీ మధ్య నన్న నందు. ఆ నందు ఒక మినీ మార్కెట్. అక్కడ ఎప్పుడూ నంత జరుగుతున్నట్లు సందడి. ఆ నంతను దాటుకొన్నాడు. కర్నాల వీధిలో అడుగు పెట్టాడు.

ఒకప్పుడు కర్నాల వీధి - ఇప్పుడు నేతాజీ రోడ్.

నేతాజీ రోడ్‌లో ఆ వేళప్పుడు ఒక లారీ నడి రోడ్డులో దర్జాగా నిలబడింది. ఆ లారీల నుంచి కూలీలు సిమెంటు బస్తాలు దింపుతున్నారు. అసలే నేతాజీ రోడ్ వెడల్పు అంతంత మాత్రం. ఆ అంతలో కొంత అన్నట్టుగా లారీ నగం రోడ్‌ను ఆక్రమించుకుంది. అందువల్ల అక్కడ రాకపోకలకు అంతరాయం కలిగింది.

లారీ ఆక్రమించుకోగా మిగిలిన నగం రోడ్డులో వచ్చే వాళ్ళు రావాలనీ, పోయేవాళ్ళు పోవాలనీ ఇరుపక్షాలూ ఇనుమిక్కులుగా ప్రయత్నిస్తూంటే వచ్చే వాళ్ళు రాలేదు. పోయే వాళ్ళు పోలేదు. ఎక్కడి వాళ్ళక్కడనే గప్‌చిప్!

వెంకటరెడ్డి కూడా గప్‌చిమని బాట పక్కనే నిలబడ్డాడు.

అంతలోనే అక్క డొక రక్షక భటుడు ప్రత్యక్షమైనాడు. ప్రజ్లు పడుతున్న ఇబ్బందిని గమనించాడు. జాలి పడినాడు. లారీ కర్రతో రంగ ప్రవేశం చేసినాడు. "ఎవరి దీ లారీ? ఎక్కడ డ్రైవర్?" అంటూ లారీ కర్రతో లారీని బాదాడు.


ఆ పక్కన్నే తిన్నె మీద నింపాదిగా కూర్చొని బీడీ కాల్చుకుంటున్న డ్రైవర్ ఎగిరిపడి లేచాడు. చేతిలోని బీడీ తుంటను విసిరి అవతల పారేశాడు. గబగబ వచ్చి రక్షక భటుని ముందు నిలబడ్డాడు. నిటారుగా నిలబడి ఠకీమని ఒక సెల్యూట్ కొట్టాడు. కొట్టిన చేతిని జేబులో పోనిచ్చాడు.

పరుల కంట పడకుండా పది రూపాయల కాగితం స్థాన భ్రంశం చెందింది.

"ట్రాఫిక్ జాం అవతా ఉండాది. తొందర తొందరగా కానీయండి!" అంటూ వాడు సైకి లెక్కాడు.

'ప్రజా సేవయే మా కర్తవ్యం' అన్న బోర్డును వీపున కట్టుకున్న ఎర్ర బస్సు ఎగిరిపడి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

'పాపిష్టి దుడ్లు ఎంత పనికైనా తెగిస్తాయి!' అని అనుకుంటూ వెంకటరెడ్డి ముందుకు కదిలాడు.




వెంకటరెడ్డి పాండురంగం ఇల్లు చేరుకొనే సరికి పాండురంగం ఇంట్లో లేడు. లేకపోతే మాత్రం ఏం? ఆ ఇంటి ఇల్లాలు ఎంతో మర్యాద చేసింది. ఇంటిలోకి అడుగు పెట్టానే కాళ్ళూ, చేతులూ కడుక్కోవడానికి నీళ్ళు ఇచ్చింది. కమ్మని భోజనం పెట్టింది. 'భార్యా పిల్లలు క్షేమమే గదా?' అని కుశల ప్రశ్నలు వేసింది. తాను చేసిన నహాయానికి తమ చర్మాన్ని చెప్పులు కుట్టి ఇచ్చినా నా ఋణం తీర దనింది.

వెంకటరెడ్డి కడుపు నిండిపోయింది. ఏం మాట్లాడాలో తోచకుండా తలవంచుకొని కూర్చున్నాడు.

"అన్నయ్యా! మీరు నిజం చెప్పినా వింటారు. అపద్ధం చెప్పినా వింటారు. ఎప్పుడో ఏదో బ్యాంకీలో చేసిన అప్పుకు అరెస్ట్ వారెంట్ వచ్చింది. నేను కుప్పగ కూలిపోయ్‌నాను. ఆయన కైతే నడుఁవులే విరిగినాయి. ఆ నమయంలో మీరు ఆదుకొన్నారు. ఇప్పుడు ఆయన అదే పని మీద తిరగతా ఉండాడు. వీలై నంత తొందర్లో డబ్బు జమచేసి పువ్వుల్లో బె ట్టియ్యాలని ఆయన పడ్తా ఉండే బాధ ఈ నోటితో చెప్ప లే నన్నయ్యా!"

వెంకటరెడ్డి పైకి లేచినాడు.

"అయ్యోయ్యో! అదేం దన్నయ్యా? కాలికి చెప్పులు తొడుక్కొని వచ్చినట్టున్నారే? రాక రాక వచ్చినారు. ఒక పూటన్నా ఉండండి. ఎంత పొద్దుపోయ్‌నా ఆయన రాత్రికి ఇల్లు చేరుకుంటారు. ఒక మాట ఆయనతో కూడా మాట్లాడిపోతే మంచిది గ దన్నయ్యా!"

"లేదు లేమ్మా! ఇంటి దగ్గర ఇబ్బంది సెప్పే దానికి మాలదు. ఒక పూట కొంప కాడ లేకుండా బోతే గొడ్లకు జూసే దిక్కు గూడా లేదు. వా డొస్తే సెప్పమ్మా. దుడ్లు దెచ్చిన సోట శానా బదనాయంగా ఉండాది."

"ఆ మాట మీరు సెప్పాల్నా అన్నయ్యా? నేను ముందుగానే చెప్తిని గదా వేళకు తిండీ తిప్పలు గూడా లేకుండా తిరగతా ఉండాడు. చేతి కొస్తానే రెక్కలు గట్టుకో నొచ్చి వాల్తాడులే! మీ రేఁవీ దిగులు పడబాకండి"

ఆ క్షణంలో ఇంత మంచి మనుమల్ని అపార్థం చేసుకొన్న తన భార్య మీద చాలా కోపం వచ్చింది వెంకటరెడ్డికి. అయినా కోపాన్ని బయట పడనీయకుండా తానే బయటపడినాడు ఆ ఇంట్లో నుంచి.

"ఇప్పు డేం జెయ్యాల?"

వెంకటరెడ్డి గాంధీ రోడ్డు మీద నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

"ఇప్పు డేం జెయ్యా లంటే - కొంప జేరుకోవాల!"

"కొంప జేరుకుంతే ఎగ వింటోడు ఎగబెట్టు కో నొస్తాడు."

"వొచ్చి 'యిస్తావా? నస్తావా?' అని నిల్దీస్తాడు.

"నిల్దీస్తే వాడి కెట్టా జెప్తే యినబోతా డబ్బా?"

పరధ్యానంగా నడుస్తున్న వెంకటరెడ్డి పైన పడుతుందేమో అనిపించిన జీప్ పక్కనే ఆగింది.

'తన పక్కనే జీ పెందుకు నిలబడిందబ్బా?' అనుకుంటూ వెంకటరెడ్డి తల పై కెత్తి చూసినాడు. జీప్‌లో భాస్కర్.

భాస్కర్ పోలీస్ నర్కిల్ ఇన్‌స్పెక్టర్.

భాస్కర్ తన ఊరి వాడే. తన ఈడు వాడే. తనతో కూడా కలిసి చదువుకున్నవాడే. అయితే తనకూ, పాడురంగాని కున్నంత అనుబంధం భాస్కర్‌తో లేదు. అయినా అనుకోకుండా ఆ స్థితిలో కంట పడేనరికి వెంకటరెడ్డి మొగంలో తంగేళ్ళు పూసినాయి. నోట మాట రాకుండా తదేకంగా భాస్కర్ వైపే చూస్తున్నాడు.

"ఏవిఁట్రా ఆ చూపులు? అది నరే కానీ ఇది రో డ్డనుకున్నావా? లేదు నీ కయ్యల్లో గనిమ లనుకొన్నావా? అంత పరధ్యానంగా నడుస్తూంటే - ఏ కారో మోటారో వచ్చి పై పడ్తే కూడా గమనించేటట్టు లేవే! ఏం కథ?"

భాస్కర్ అడుగుతున్నాడు.

వెంకటరెడ్డి భాస్కర్ తల్లిని గురించి ఆలోచిస్తున్నాడు.

"భాస్కర్ తల్లి విమలమ్మ. ఎంత మంచి మడిసో. ఆఁవె సేతికి ఎఁవికే లేదు. ఎప్పుడు పోయ్‌నా నరే! తినే దానికి ఏదో వొగిటి పెట్టకుండా

యిడ్చిపెట్టేది గాను. ఆ మహాతల్లి న్జూసి ఎన్ని దినాలైపాయ? యా డుండాదో! ఎట్టుండాదో?''

"ఏఁవిరా? అడిగే దెవర్ని? సమాధానం చెప్తావా? ఎత్తి జీపులో వేసుకోమంటావా?'' పోలీస్ జులుం పరాచికా లాడుతూ ఉంది.

"అది సరే గానీ బాస్కరా! అమ్మ యాడుండాదిరా?''

'.ఎక్కడో ఎందుకుంటింది? నా దగ్గరే ఉంది.''

"అయితే ఒకసారి చూసి పోదాఁ వనుండాదిరా?''

"ఒక్కసారే ఎందుకు? ఒక్క దినమంతా కూర్చొని చూడు. ఎక్కు జీప్ పోదాం.''

వెంకటరెడ్డి జీప్ ఎక్కినాడు. జీప్ కదిలింది. అసలే జీప్. అందులో పోలీస్ జీప్. అడ్డం ఆవ్వా ఉంటుందా? ఎదురుగా వచ్చిన వాళ్ళు తొలగవలసిందే. వద్దనుకుంటే దాని కింద పడి నగలవలసిందే. శరవేగంతో దూసుకుంటూ వచ్చి వదిహేను నిముషాల్లో భాస్కర్ ఇంటి ముందర ఆగింది.

"దిగరా వెంటరెడ్డీ దిగు. దిగి అమ్మతో మాట్లాడ్తా ఉండు. నాకు కొన్ని అవసరమైన పను లున్నాయి. చూసుకొని వెంటనే వచ్చేస్తా. నేను వచ్చే దాకా ఉండు. ఉడాయించేస్తివో పోలీసోడితో పా త్తని మరచిపోవద్దు.

జీప్ ముందుకు కదిలింది.

వెంకట రెడ్డి ఇంటి లోపలికి నడిచినాడు.

ఇల్లు అధునాతన రీతుల్లో చాలా అందంగా ఉంది. ఇంటి చుట్టూ ప్రహరీ గోడ. ఇంటి ముందర పూల తోటలు. ఇంటి చుట్టూ రకరకాల ఫలజాతుల చెట్లూ.

ఇంటి ముఖద్వారాన్ని దాటి, ఇంటి చుట్టూ గమనిస్తూ, జంకుతూ జంకుతూ నడుస్తున్న వెంకటరెడ్డి ఆ ఇంట్లోని బొచ్చు కుక్క కంట పడినాడు. దాని రంపు అంత ఇంత కాదు. తలుపులు మూసి ఉండకపోతే ఏకంగా పైన బడి పీకుతుం దేమో అన్నట్లుంది దాని ఆర్భాటం.

"కుక్క లున్నాయి జాగ్రత్త!'' అని బోర్డు పెట్ట నందుకు వెంకటరెడ్డికి భాస్కర్ మీద చాలా కోపం వచ్చింది.

కడవ డంత గుమ్మడి కాయ అయినా కత్తిపీటకు లోకువైనట్టు వెంకటరెడ్డి మగవాడే కావచ్చు. కానీ కుక్క బుద్ధి కుక్కబుద్దేగా!

ముందుకు పోలేక, వెనక్కు రాలేక తటపటాయిస్తున్నాడు.

అంతలో ఒక నడివయసు స్త్రీ - నాజూగ్గా ఉః ంది. ఠీవీగా వచ్చింది.

"ఏయ్ జానీ కీప్ క్వయిట్! కీప్ క్వయిట్!'' అంది.

ఆ మందలింపులో కూడా ఎంతో ఆప్యాయత తొణికిన లాడుతోంది.

ఆ మాటతో కూడా కుక్క అరవడం మానుకొనింది. తో కాడిస్తూ ఆ ఇల్లాలి చీర కుచ్చెళ్ళు లాగుతోంది.

ఆ క్షణంలో కుక్కకు కూడా తన భాష ఒంటబట్టించిన తెల్లోడి మీద వెంకటరెడ్డికి చాలా కోపం వచ్చింది. ఇంగ్లీషు నేర్చుకున్న కుక్క మీద వల్లమాలిన అభిమానం కలిగింది. ఆ కుక్క వైపు వింతగా చూస్తున్నాడు వెంకటరెడ్డి.

"ఎవరు కావాలండీ?''

కుక్కమీద వెంకటరెడ్డి చూపులు తటాలున అడుగుతున్న ఆమె వైపు మర్లినాయి. ఆమె కూడా "మిమ్మల్నే అడిగేది!'' అన్నట్టు అనహనంగా చూస్తోంది.

"విమలమ్మగారి కోసరం'' నసిగాడు వెంకటరెడ్డి.

" ఆ గదిలో ఉన్నారు చూడండి!'' అంటూ ఆమె గిరుక్కున వెనక్కు తిరిగింది. ఆమె ముందు, జానీ వెనుకగా విసవిస లోనికి వెళ్ళారు.

ఇంటి ముందర తాళవారం. ఆ తాళ వారానికి ఎడమవైపు గది. ఆ గది ముందర పరదా చాలా సరదాగా ఉంది. ఆ పరదాను తొలగించుకొని లోపల అడుగు పెట్టాడు వెంకటరెడ్డి.

గది చాలా శుభ్రంగా ఉంది. ఆ గదిలో ఒక మంచం. మంచానికి ఎదురుగా చిన్న మేజా. ఆ మేజా మీద ఒక స్టీల్ తట్టా, లోటా. మంచానికి పక్కన్నే ఒక స్టూల్. ఆ స్టూల్ మీద ఒక కూజా. ఆ కూజా మీద బోర్లించిన ఒక లోటా. గాలీ, వెలుతురూ ధారాళంగా రావడానికి గోడలకు కిటికీలు, పైన పంకా ...

ఆ మంచం మీద కలమాగి పండిన పండు విమలమ్మ! వెల్లకిలా పడుకొని తదేకంగా పంకాను పరిశీలిస్తున్నట్టుంది.

"అమ్మా!'' వెంకటరెడ్డి పిలిచాడు.

వయసు మళ్ళిన ఆ తల్లికి మల్లే మంచానికి కూడా వయసు పై బడినట్లుంది. అది కిర కిర శబ్దం చేసింది. 'ఎవరయ్యా?'' అంటూ ఆమె మెల్లగా లేచి కూర్చుంది.

"నేను వెంకటరెడ్డి నమ్మా!''

ఆ మాట చెవిని పడేసరికి ఆ పండిన మొఖం లోని ముడతల్లో ముసురుకొన్న చీకట్లపైన వెలుతురు దండయాత్ర చేసింది. ఆ ముఖం కాంతివంతమైంది.

"ఎంగ ట్రెడ్డా? బాగుండావా అబ్బోడా? ఎన్నాళ్ళ కెన్నాళ్ళకురా? పెండ్లాం, పిలకాయిలు బాగుండారా? అదేందిరా నాయనా అప్పుడే తలకాయి ముగ్గుబుట్ట మాదిరైపొయ్యింది. అవున్లే యాబై పై బడుండ్లా? - ఎప్పు డొస్తివి వబ్బోడా? ఊళ్ళో అందురు బాగుండారు కదా?'' - గుక్క తిప్పుకోకుండా విమలమ్మ ప్రశ్నల వర్షం కురిపించింది.

'ఈడ కొంచిం పనుంటే ఆ పని మీద మద్దేణం కాడొస్తినమ్మా! పని గాలా. తిరుక్కోని పోతా ఉంటే దోవలో మన బాస్కరు డెదురు పడె. ను వ్వీణ్ణే ఉండేదంటే వొస్తి. సూడా లని శానా దినాలుగా మునాస పడ్తా ఉంటే అది ఈ పొద్దిటికి తీరె. ను వ్వెట్టుండా వమ్మా?''

"సుస్తా ఉండావ్ గద నాయినా? నా కేం తక్కువ. ఇద్దో ఈడ కూజా ఉండాది. కూజాలో సల్లంగా నీ ళ్ళుండాయి. తాగా లనుకుణ్ణెప్పుడు తాగచ్చు. అద్దో ఆడ జూడు కంచం. యాళేళకు అంత అన్న నడ్సు కోనొస్తింది. పిలిస్తే పలికే దానికి జవా న్లుండారు. ఆ జవాన్లు పిలిస్తే పరిగిత్తా వచ్చే డాక్ట ర్లుండారు. నా కేం తక్కువరా ఎంగట్రెడ్డీ! ఏం తక్కువ లే!''


ఏమీ తక్కువ లే దంటున్నా ఏదో తక్కువగా ఉన్నట్లే ఆమె మాటల్లో ధ్వనిస్తా ఉంది. అయితే అదేమో వెంకటరెడ్డికి అంతు దొరకలేదు. అదే ఆలోచిస్తూ ఆమె వైపు చూస్తున్నాడు.


అంతలోనే బొచ్చుకుక్క అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చింది. విమలమ్మను ఒక చూపు చూసింది. అంతలోనే చూపులు మళ్ళించి వెంకటరెడ్డిని ఒక చూపు చూసింది. చెవులు కొట్టుకుంటూ తల అడ్డంగా ఆడించింది. ఎట్లా వచ్చిందో అట్లానే బయటికి పరుగెత్తింది.

ఆ కుక్క వెళ్ళిన వైపే చూస్తూ విమలమ్మ ఒక మహా వేదాంతిలా నవ్వింది.

ఆ నవ్వులో ఆంతర్యం వెంకటరెడ్డికి బోధపడలేదు. క న్నార్పకుండా ఆమె వైపే చూస్తున్నాడు.

"ఆ కుక్క న్జూస్తివి గ దబ్బోడా?! ఆ కుక్క గ్గూడా వొక జవా నుండాడు. దానికి రొండు పూట్లా స్తానం చెయ్‌పిస్తాడు. మూడు పూట్లా పాలు తాగిపిస్తాడు. 'కుఁయ్ కఁయ్' అనిందా బిస్కత్తులు తినిపిస్తాడు. జబ్బు గిబ్బు వొస్తే డాక్టర్లు పరిగెత్తు కో నొస్తారు.''





ఆమె ఒక రకంగా చూస్తూ, ఇంకొక రకంగా నవ్వుతోంది.

ఆ చూపు, ఆ నవ్వు ఎక్కడో వెదకి ఆయువు పట్టును పట్టుకొంటే వెంకటరెడ్డి గిలగిల లాడిపోతున్నాడు.

కాలం గడుస్తోంది. ఇద్దరి మధ్యా మాటలు కరువైనాయి. గదిలో నిశ్శబ్దం.

అట్లా ఎంతసేపు గడిచిందో తెలియదు.

వెంకటరెడ్డి పైకి లేచాడు. ఆమెను చూస్తూ భారంగా ఒక నిట్టూర్పు విడిచాడు. మెల్లగా గది బయటికి నడిచాడు.

గది ముందు నిలబడిన వెంకటరెడ్డి ఒక్కసారి ఇంట్లోకి చూశాడు.

భాస్కర్ అప్పుడే వచ్చినట్లుంది. ఖాకీ దుస్తులు విడిచిపెట్టి లుంగీలో దూరుతున్నాడు. భార్య ఎదురుగా నిలబడి ఖాకీ దుస్తులు అందుకొంటోంది. బొచ్చుకుక్క వాడి పై పైకి ఎగబడుతోంది. వా డా కుక్కను ఎత్తుకున్నాడు. కుర్చీలో కూర్చున్నాడు. "ఏరా జానీ! పాలు తాగావా? బిస్కట్లు తిన్నావా?" అంటూ బొచ్చు కుక్కతో ముడిగారాలు పోతున్నాడు. అది వాడి మూతి నాకడానికి ముంపుతూంది.

చిన్నప్పుడు తల్లి ఒడిలో భాస్కర్ గుర్తు కొచ్చాడు వెంకటరెడ్డికి.

వెంకటరెడ్డి తల వాలిపోయింది. పిల్లి మాదిర ఆ ఇంట్లో నుంచి బయటపడ్డాడు. నడి రోడ్డులో నిలబడ్డాడు. తలను వెనక్కు తిప్పగలిగి నంతవరకు తిప్పాడు. ఒక్కసారి ఆ ఇంటివైపు ఎగాదిగా చూసినాడు. తక్షణమే తల వంచాడు. వంచిన తలెత్తకుండా నడుస్తున్నాడు. నడుస్తూ ఆలోచిస్తున్నాడు.

"నా దగ్గిర దుడ్లు లేవు. అయినా పాండురంగం వొచ్చి సేతులు పట్టుకుంటే నేను బొయ్ యింకొకడి కాళ్ళూ సేతులు పట్టుకుంటి. కారణం? ఆత్మీయత.

ఇచ్చిన దుడ్లు అడగదాఁ వని వొస్తి. అడగలేకుండా బోతి. కారణం? ఆ యిల్లాలు సూపించిన ఆత్మీయత.

ఇంటికాడ యిబ్బందులు మూడుమూసి ఆరు అతికినట్లుంటే విమలమ్మ దగ్గిరికి నడిపించింది - ఆత్మీయత !

ఆ ఆత్మీయతే కరువైతే?

ఆ క్షణంలో కుక్క బ్రదుకు, కుక్క చావు అన్న పదాలకు అర్థమే తారుమారైనట్లు తోచింది వెంకటరెడ్డికి.

"ఈ లోకంలో కుక్కల కంటే హీనంగా ఎంతమంది బతకత ఉండారో?" అని ఆలోచించేసరికి విమలమ్మ ఒక ఏ క్లాస్ ఖైదీలా అనిపించింది వెంకటరెడ్డికి. ★